కేజీబీవీకి మరమ్మతులేవీ!

- శిథిలావస్థలో పాఠశాల భవనం
- వర్షమొస్తే గదుల్లోకి నీరు
- తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం అంతంత మాత్రమే..
- పన్నెండు సంవత్సరాలుగా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు



శిథిలావస్థకు చేరిన నిడమనూరులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ భవనం



పగుళ్లు బారిన భవన గోడలు

నిడమనూరు : నిడమనూరు మండల కేంద్రం శివారులోని వేంపాడు వద్ద నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) భవనం శిథిలమవుతున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. పన్నెండేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం వర్షాలకు కురుస్తూ తరగతి గుదుల గోడల నుంచి నీరు కారుతోంది. దీంతో గోడలు నల్లటి చారలమయంగా మారాయి. విద్యాలయంలో ఇప్పటికే కిచెన్, స్టోర్‌రూం పలుచోట్ల పగుళ్లు వచ్చాయి. భవనంతోపాటు లోపల గదులకు ఇప్పటి వరకు రంగులు కూడా వేయకపోవడంతో కళావిహీనంగా మారింది. ఈ విద్యాలయాన్ని పొలాల మధ్య నిర్మించడంతో సాగునీరంతా సీపేజీ (ఊట) ద్వారా పాఠశాల ప్రాంగణంలోకి చేరి నిల్వ ఉంటోంది. ప్రహరీ పిల్లర్ల మధ్య పలుచోట్ల గోతులు ఏర్పడి కుక్కలు, పాములు విద్యాలయ ప్రాంగణంలోకి వస్తుండడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు విద్యాలయ ప్రాంగణంలో రాత్రి వేళల్లో కనీస వెలుతురు కూడా లేదు.

రెండేళ్ల క్రితమే రంగులు వేయాల్సి ఉన్నా..

'మన ఊరు–మన బడి' పథకంలో భాగంగా రెండేళ్ల క్రితం భవనానికి రంగులు వేయాల్సి ఉన్న నేటి వరకు చేయలేదు. పాఠశాల భవనం గోడలు వానలకు తడిసి రంగులు వెలిసిపోయి, పాకూరు పట్టి నల్లగా మారాయి. అయితే కొన్ని సివిల్ పనులు, రంగుల పనులు వేసవిలో చేపట్టాల్సివుండగా చేపట్టలేదు. పలుచోట్ల పగుళ్లు, కిటికీలు ఊడిపోయి శిథిలభవనంగా మారింది. విద్యాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి ఆటాపాటలకు అసౌకర్యంగా మారాయి. ఇవేకాకుండా తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం అంతంతమాత్రంగానే ఉంది. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. దీంతో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రస్తుతం ఉన్న ప్రస్తుతం 242 మంది బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యాలయ భవనానికి రంగులు వేసి సివిల్ పనులు పూర్తిచేసి బాలికల ఇబ్బందులు తీర్చాలని బాలికల తల్లిదండ్రులు పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఆదేశం

కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం రాత్రి కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవనం ముందు కనీసం విద్యుత్ దీపాలు లేకపోవడం, పలుచోట్ల ప్రహరీ శిథిలమై ఉండడాన్ని గుర్తించారు. దీంతో ఆమె వెంటనే విద్యాలయం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని ఏఈ రవికుమార్‌ను ఆదేశించారు.

భవనం స్థితి అధికారులకు వివరించాం..



"కస్తూరిబా గాంధీ విద్యాలయ భవనాన్ని పలువురు అధికారులు పరిశీలించారు. తాను రెండు సంవత్సరాల క్రితమే నిడమనూరు ఇక్కడకు వచ్చాను. భవనం దుస్థితి, మరమ్మతులపై అధికారులకు వివరించాను. ఇటీవల విద్యాశాఖ ఇంజనీర్ల ప్రతిపాదనలు రూపొందించారు.

–పద్మ, కేజీబీవీ ప్రత్యేకాధికారి

ఇటీవలే సివిల్ పనులు మంజూరయ్యాయి



"నిడమనూరు కస్తూరిబా గాంధీ విద్యాలయానికి ఇటీవలే రూ.10 లక్షల సివిల్ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో రూ.4.82 లక్షలు నిధులు విడుదలయ్యాయి. భవనం అనుబంధంగా నిర్మించిన నిర్మాణాలకు పగుళ్లు వచ్చాయి. వీటితోపాటు మిగతా పనులన్నీ పూర్తిచేస్తాం.

– ఎల్.వెంకన్న, మండల విద్యాధికారి

క్లుప్తంగా

విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి

కొండమల్లేపల్లి : మండలంలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, డాక్టర్ రసూల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వంట గదిని, ఆర్‌ఓఆర్ ప్లాంట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కత్తుల సరళ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములపల్లి ఎంపీడీఓగా జితేందర్‌రెడ్డి



వేములపల్లి : వేములపల్లి ఎంపీడీఓగా దండ జితేందర్‌రెడ్డి గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన శారదాదేవి బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వెళ్లగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న జితేందర్‌రెడ్డి బదిలీపై వేములపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానన్నారు.

గుర్రంపోడు ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీనివాస్‌రెడ్డి



గుర్రంపోడు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

గుర్రంపోడు : గుర్రంపోడు ఇన్‌చార్జి ఎంపీడీఓగా జి.శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీఎఓ మంజుల సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు

విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని తిరుమలగిరి సాగర్ ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని యల్లాపురం, యల్లాపురంతండా ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గుణించడం తప్పనిసరిగ్గా రావాలన్నారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం శ్రీదేవి, అమరయ్య, ఉపాధ్యాయులు సేవ్య నాయక్, గౌహర్, శైలజ, సీఆర్‌పీ నాగసిద్ధార్థ ఉన్నారు.

భద్రత, శుభ్రతే లక్ష్యంగా యంత్రాలు, సామగ్రి



కార్మికులకు సామగ్రిని పంపిణీ చేస్తున్న కమిషనర్ గురులింగం

నాగార్జునసాగర్: కార్మికుల భద్రత, పరిసరాల శుభ్రతే లక్ష్యంగా నమస్తే స్కీం (నేషనల్ యాక్షన్ మెకానైజుడ్ శానిటేషన్ ఎకోసిస్టం) ద్వారా కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల భద్రత, శుభ్రత పరికరాలతోపాటు మలశుద్ధి యంత్రాలను అందిస్తోందని నందికొండ మున్సిపల్ కమిషనర్ గురులింగం తెలిపారు. గురువారం నందికొండ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం జాతీయ చర్య ప్రణాళిక సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శుభ్రత, కార్మికుల ఆరోగ్య భద్రత, గౌరవ జీవన విధానాన్ని మెరుగు పరచడం ఈ పథకం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్ప్రింక్లర్లు,పైపుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుర్తుచేశారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కింన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా 9రోజుల్లో రూ.9వేల కోట్లను రైతుల ఖాతాలో రైతు భరోసా పథకం కింద జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హన్మంతు వెంకటేష్‌గౌడ్, మారుపాకుల సురేష్‌గౌడ్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, జూలూరి గిరి, కిన్నెర హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



స్ప్రింక్లర్లు, పైపులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు వినతి

దేవరకొండ మండలం కొండభీమనపల్లి వద్ద డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. డివైడర్లు లేకపోవడం వల్ల కొండభీమనపల్లి, బొల్లిగుట్టతండా, గిరిజానగర్‌తండా వద్ద జరిగిన ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయపడ్డారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, పాండు, సత్యనారాయణ, నాగరాజు, బాలు, లోకేష్, యాదయ్య, చంద్రయ్య, నగేష్ ఉన్నారు.

తెలంగాణ ప్రయోజనాలు ఆంధ్రాకు తాకట్టు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ: తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టు పెట్టిన నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆరోపించారు. గురువారం దేవరకొండ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంపై మొన్న చంద్రబాబుపై సవాల్ విసిరిన రేవంత్‌రెడ్డి.. నిన్న ఢిల్లీలో జరిగిన చర్చల్లో లొంగిపోయారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి బనకచర్లపై నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు బనకచర్ల అనుమతులు తెచ్చుకునేంత వరకు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయరని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌పై అవగాహన లేకుండా పనులు మొదలుపెట్టి కార్మికుల ప్రాణాలు బలిగొన్నారని పేర్కొన్నారు. సమావేశంలో టీవీఎన్ రెడ్డి, వల్లపురెడ్డి, గాజుల ఆంజనేయులు, ఏసోబు, చంద్రమౌళి, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం చాలా గొప్పది

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



భారత రాజ్యాంగ పుస్తక ప్రతిని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి అందిస్తున్న నాయకులు

మిర్యాలగూడ : ప్రపంచ రాజ్యాంగాలలో భారత రాజ్యాంగం చాలా గొప్పదని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ తెలుగు పుస్తక ప్రతిని ఆయనకు అందజేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నాయని చెప్పారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను ప్రతి ఒక్కరు చదివి అవగాహన చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం నలగొండ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి, బంజారా ఉద్యోగ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సిద్ధునాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, దాస్యనాయక్, బాలోజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే ప్రసవం

నిడమనూరు : ప్రసవం కోసం గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. సాగర్ తిరుమలగిరి మండలం తిమ్మాయిపాలెం ఆవాస గ్రామం సారెగూడెం తండాకు చెందిన ముడావత్ కల్యాణి పురిటి నొప్పులు రావడంతో బుధవారం అర్ధరాత్రి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా నిడమనూరు మండలం తుమ్మడం శివారుకు చేరుకోగానే నొప్పులు ఎక్కువ కావడంతో డాక్టర్ నవనీత సూచనల మేరకు 108 సిబ్బంది రాకేష్ ప్రసవ సేవలందించారు. కల్యాణికి మగబిడ్డ ప్రసవించగా ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లి, బిడ్డా క్షేమంగా ఉన్నారు. 108 సిబ్బంది రాకేష్, గణేష్‌లను కుటుంబ సభ్యులు, ఆస్పత్రి వైద్యులు అభినందించారు. రాకేష్ అత్యవసర సమయాల్లో 20 మంది గర్భిణులకు ప్రసవ సేవలందించారు.

'మిర్యాల'కు జాతీయ స్థాయిలో 417 ర్యాంకు

- స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు ప్రకటించిన కేంద్రం
- రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకు
- గతంలో కంటే వెనుకబడిన మున్సిపాలిటీ



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్ : స్వచ్ఛ భారత్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ్ సర్వేక్షణ్–2024–2025 ర్యాంకులను ప్రకటించింది. శుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహిస్తుంది. మున్సిపాలిటీలో 48 వార్డులుండగా ఆయా వార్డుల నుంచి 12 వేల మార్కులపై సర్వే నిర్వహించింది. ఇందులో మిర్యాలగూడ మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో 417, రాష్ట్ర స్థాయిలో 69వ ర్యాంకు సాధించింది. మున్సిపాలిటీలో డోర్ టు డోర్ చెత్త సేకరణలో 47శాతం, తడి, పొడి చెత్త వేరు చేయా విధానంలో 35 శాతం, చెత్త ఉత్పత్తి, ప్రాసెసింగ్‌లో వందశాతం పనితీరు కనబరిచినట్లు సర్వేలో వెల్లడైంది. అయితే 2023–2004లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో 187వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు సాధించినప్పటికీ ఈ ఏడాదిలో చాలా వెనుకబడిపోయింది.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న యడవెల్లి విజయేందర్‌రెడ్డి

హాలియా : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం అనుముల మండలంలోని పాలెం, రామడుగు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో వారు మాట్లాడారు. ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. సమావేశాల్లో మాజీ సర్పంచ్‌లు బిల్లకంటి లక్ష్మమ్మ శ్రీనివాస్, మజ్జిగపు వెంకటరావిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఊర్లగొండ వెంకటయ్య, నాయకులు చేగొండ కృష్ణయాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు కాట్నం నాగరాజు గౌడ్, చిన్నబోయిన నాగరాజు, జక్కల శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజు, సాయి, రమేష్, వెంకన్న, నర్సిరెడ్డి, మామిడి శంకర్ పాల్గొన్నారు.

వర్షం కురవాలని జలాభిషేకం



చింతపల్లిలో బొడ్రాయికి జలాభిషేకం నిర్వహిస్తున్న గ్రామస్తులు

చింతపల్లి: వరుణదేవుని కరుణించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని రైతులు వరుణ యాగం నిర్వహించారు. సాయిబాబా దేవాలయంలో ఆలయ కమిటీ వారు సాయినాథుడికి ప్రత్యేక పూజలు వరుణ యాగం చేపట్టారు. అలాగే గ్రామస్తులు డబ్బు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వచ్చి గ్రామ దేవతల విగ్రహాలకు, బొడ్రాయికి జలాభిషేకం చేశారు. రాజరాజేశ్వర ఆలయంలో శివలింగం పూర్తిగా మునిగిపోయే వరకు జలాభిషేకం నిర్వహించారు.



డిండిలో పూజలు చేస్తున్న రైతులు, మహిళలు

డిండిలో వరదపాశం ఆరగించి..

డిండి: వర్షాలు కురవాలని కోరుతూ గురువారం డిండి మండల కేంద్రంలో గ్రామస్తులు, రైతులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక చెన్నయ్య గుట్ట వద్ద చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే వరద పాశం వండి బండపై పోసి ఆరగించారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు ప్రకాష్, వెంకటేష్, మల్లయ్య, లింగమయ్య, రాజు, లక్ష్మారెడ్డి, సైదులు, వెంకటయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం

హాలియా : ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానంతో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు అన్నారు. గురువారం హాలియా పట్టణంలోని విశ్రాంతి అతిథి గృహంలో జరిగిన సాగర్ నియోజకవర్గ మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు సూచనలు పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వం దళితుల్లోని వెనుకబడుతనాన్ని గుర్తించకుండా ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించిందని, గ్రూపు 3లో ఉన్న మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతాయన్నారు. రోస్టర్ విధానాన్ని తక్షణమే సవరించి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న తిరుమలగిరి (సాగర్) మండలం అల్వాల ఎక్స్ రోడ్డులోని శుభం ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు జంగాల భిక్షం, సామ వెంకట్ రాములు, శాలెం రాజు, మహిళా రాష్ట్ర కార్యదర్శి సుమలత, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు జంగాల వీరేందర్, జిల్లా మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల నాగమణి, బాలమ్మ, మౌనిక, శ్రీలత, అరుణ, నాగేంద్ర, రూప వెంకటేశ్వర్లు, మర్రి వెంకటయ్య, మద్దూరి శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మధుబాబు

మా భూమి మాకు ఇప్పించాలి

- పురుగుల మందు డబ్బాతో బాధితుల ఆందోళన
- మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఘటన



ఆందోళన చేస్తున్న బాధితులు

మిర్యాలగూడ : ఓ బ్యాంకు ఉద్యోగి ఆక్రమించుకున్న మా భూమి మాకు ఇప్పించాలంటూ బాధితులు దైద రమణ, దైద శ్రీను గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 158, 153లోని ప్రభుత్వ భూమిలో ఏళ్ల తరబడి తాము కబ్జాలో ఉన్నామని బాధితులు పేర్కొన్నారు. ఆ భూమికి సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో రెండు ఎకరాలకు పట్టా కూడా ఇచ్చారన్నారు. పక్కనే మిగతా ఎకరం వరకు భూమిని కూడా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇదే భూమి పక్కన ఉన్న వేరే వారి భూమిని కొనుగోలు చేసిన రామకోటి అనే బ్యాంకు ఉద్యోగి రాత్రి వేళల్లో యంత్రాల సాయంతో మా భూమి సరిహద్దులను చెరిపేసి ఆక్రమించుకున్నారన్నారు. ఈ విషయంపై అడవిదేవులపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ కబ్జాదారుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమకు ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేసి రామకోటికి అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ పూర్తి విచారణ చేసి మాకు న్యాయం చేయాలని కోరారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

దేవరకొండ: ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23న నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థలను బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థులు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు ఇద్ది రాములు, రాకేష్, వినోద్, శివ, మునేష్, చరణ్, రవి, శశి పాల్గొన్నారు.

వెలగని వీధిదీపాలు.. తప్పని ఇబ్బందులు



పెద్దవూరలో వెలగని వీధి దీపాలు

పెద్దవూర: మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై పోలీస్ స్టేషన్ నుంచి చిన్న వాగు వంతెన వరకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు రాత్రి సమయంలో వెలగడం లేదు. దీంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రం కావడంతో నిత్యం ఈ రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. రాత్రి సమయాల్లో సెంటర్‌కు రావాలంటే రోడ్డుపై వీధి దీపాలు వెలగ చిమ్మచీకటి ఉండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. కాగా వీనిలో పోలీస్‌స్టేషన్ సమీపంలో కొన్ని దీపాలు వెలుగుతుండగా ప్రధాన సెంటర్‌లో మాత్రం వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రాత్రి సమయంలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు చేయూత హర్షణీయం



విద్యార్థులకు నోట్ బుక్స్, ఇతర సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వడం హర్షణీయమని హాలియా ఎంఈఓ గుండా కృష్ణమూర్తి అన్నారు. గురువారం అనుముల మండలం హజారిగూడెం (రత్న తిరుపతి) ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు జానపాటి వెంకటేష్, జానపాటి శేఖర్, జానపాటి భాస్కర్ సమకూర్చిన షూ, నోట్ బుక్స్. పరీక్ష ప్యాడ్లులతోపాటు ఇతర సామగ్రిని ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, మాజీ ఉప సర్పంచ్ షేక్ జబీన్ జలీల్ పాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శ్రీలక్ష్మి, దాత భాస్కర్, ఉపాధ్యాయురాలు దివ్యశ్రీ, సీఆర్పీ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, విజయలక్ష్మి, నాయకులు మోదాల ఆంజనేయులు, నాగరాజు, జలీల్, మంగమ్మ, సైదమ్మ, అజ్మతమ్మ, సమీనా, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల లింగం గౌడ్

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 21నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం యథావిధిగా ఆమోదించాన్నారు. ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రవర్ణాలకు రాత్రికి రాత్రే 10శాతం రిజర్వేషన్లు కల్పించారని, బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎందుకు నాన్చుస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, ఎర్రబెల్లి దుర్గయ్య, ఊరిబండి శ్రీనివాస్ యాదవ్, నక్క నాగరాజు, దోనేటి శేఖర్, సైదులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.